## క్లుప్తంగా

### మండల వ్యవసాయ అధికారిగా విజయ్‌బాబు



దుగ్గిరాల: దుగ్గిరాల మండల వ్యవసాయ అధికారిగా రాగాల విజయ్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రేపల్లె మండల వ్యవసాయ అధికారిగా పని చేసిన ఆయన బదిలీపై దుగ్గిరాల వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌలు రైతులు కార్డులు, ఖరీఫ్‌కు సంబంధించిన వరి విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాలలో వీఏఏను సంప్రదించాలని అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కోసం రైతులందరూ ఈ–కేవైసీ పూర్తి చేసుకోవాలని తెలియజేశారు.

### తాడేపల్లి నూతన సీఐగా వీరేంద్రబాబు



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ నూతన సీఐగా పి.వీరేంద్రబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన సీఐ బత్తుల కల్యాణ్‌రాజు బదిలీ కావడంతో ఆయన స్థానంలో వీరేంద్రబాబు నియమితులయ్యారు. గతంలో ఆయన తాడేపల్లి ఎస్‌ఐగా విధులు నిర్వహించడంతో పాటు ఫిరంగిపురం, పట్టాభిపురం సీఐగా విధులు నిర్వహించారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐలు, సిబ్బంది నూతన సీఐ వీరేంద్రబాబుకు అభినందనలు తెలిపారు.

### మున్సిపల్ కార్మికులకు తల్లికి వందనం అందించాలి

తాడేపల్లి రూరల్: మున్సిపల్ కార్మికులకు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని సీఐటీయూ యూనియన్ నాయకులు బూరగ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని కృష్ణుడి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మున్సిపల్ కార్మికులకు అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మున్సిపల్ కార్మికులకు పథకాలు అమలు చేయకపోవడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో ఎం.కామాక్షి, కె.నాని, సామ్రాజ్యం, శ్రీను, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### రహదారిపై కొండచిలువ హతం



తాడేపల్లి రూరల్: మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారిపై ప్రకాష్ నగర్ శ్రీరామ్ పాఠశాల ఎదురు రోడ్డుపై కొండచిలువ అటూఇటూ తిరుగుతూ ప్రయాణీకులను భయభ్రాంతులకు గురిచేసింది. సోమవారం రాత్రి సుమారు 8 అడుగుల పొడవున్న కొండచిలువ రోడ్డుకు తిరుగుతూ ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేసింది. దీంతో యువకులు కొండ చిలువను చంపేందుకు పెద్ద రాళ్లు విసరడంతో కొండ చిలువ ద్విచక్రవాహనాల్లోకి దూరి చుట్టేసుకుంది. చివరకు స్థానిక యువకులు కొండచిలువను మట్టుబెట్టారు. రోడ్డు పక్కన కొండచిలువ చనిపోయి ఉండటంతో అటుగా వెళ్లే వారంతా ఆగి చూస్తుండటంతో ట్రాఫిక్‌కు కొంత అంతరాయం ఏర్పడింది.

### భవన నిర్మాణ కార్మికులకు బీమా సౌకర్యం

తాడికొండ: భారతీ సిమెంట్ కంపెనీ భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీలకు రూ.లక్ష బీమా అందిస్తుందని కంపెనీ సేల్స్ మేనేజర్ జయరాములు, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ భవానీ శంకర్‌లు తెలిపారు. సోమవారం తాడికొండలో దినేష్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేస్తున్న భారతీ సిమెంట్ భవన నిర్మాణాల్లో పటిష్టతకు నంబర్–1గా నిలుస్తుందన్నారు. అనంతరం భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీలకు సందేహాలను నివృత్తి చేశారు. రూ.లక్ష బీమా సదుపాయం కల్పించే బాండ్లు అందజేశారు. కార్యక్రమంలో దినేష్ ఏజెన్సీ ప్రొప్రైటర్ దినేష్‌రెడ్డి, పలువురు మేస్త్రీలు, కార్మికులు పాల్గొన్నారు.

### ప్రైవేటు ఉద్యోగి ఆత్మహత్య



తెనాలిరూరల్: ఆర్థిక ఇబ్బందులతో ప్రైవేటు ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు.. పట్టణ చినరావూరుకు చెందిన యడ్ల నాగవెంకట మల్లేశ్వరరావు (46) బీఎస్‌ఎన్‌ఎల్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం ఉదయం వైకుంఠపురం నుంచి చినరావూరు స్టేషన్ల మధ్య పట్టాలపై అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. జీఆర్పీ పోలీసులకు తెలుపగా ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెంకటాద్రిబాబు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

# సాగునీటి కాలువలను ఆధునీకరించాలి



చానల్‌ను పరిశీలిస్తున్న రైతు సంఘాల నాయకులు

మంగళగిరి: ప్రభుత్వం వెంటనే సాగునీటి కాలువలను ఆధునీకరించి రైతులకు సాగునీరు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సాగునీటి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సాగునీటి సంఘాల నాయకులు, కౌలు రైతు సంఘం నాయకులు, రైతు సంఘం నాయకులు మండలంలోని పెదవడ్లపూడి హైలెవల్ చానల్ మద్రాస్ కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలువలను ఆధునీకరించే పనులు చేపట్టకపోవడంతో కాలువలలో పెద్ద ఎత్తున తూటికాడ, గుర్రపు డెక్క, మట్టి మేటలతో కూరుకుపోయి నీరు పారుదల నిలిచిపోయిందన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకర్ మాట్లాడుతూ.. కృష్ణానది ఉండవల్లి నుంచి ప్రారంభమైన బకింక్ హామ్ కెనాల్ నిజామ్‌పట్నం వరకు తెనాలి డెల్టా ఏరియాలో 7 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తుందన్నారు. కానీ బకింగ్ హామ్ కెనాల్, తెనాలి డెల్టా కాలువల ఆధునీకరణకు కోట్ల రూపాయాలు మంజూరైనప్పటికీ పనులు జరగడం లేదన్నారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు ములక సాంబిరెడ్డి, నాగ మల్లేశ్వరరావు, జెట్టి బాలరాజు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కారుమూరి మాధవరెడ్డి, బి.సత్యమారెడ్డి, గాదె మాధవరెడ్డి, ఎస్.రామిరెడ్డి, ఈదా మహేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిలో జాబ్ మేళా రేపు

తాడికొండ: అమరావతిలో బుధవారం జాబ్ మేళాను నిర్వహించున్నట్లు ఏపీ సీఆర్డీయే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో తుళ్లూరు సీఆర్డీయే స్కిల్ హబ్ కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి ఈ జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ మేళాలో ఎంపికైన వారికి 400లకు పైగా ఉద్యోగ అవకాశాలు అమరావతి పరిసర ప్రాంతాల్లో కల్పించనున్నామని.. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మేళాలో ఎంవీఆర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ లిమిటెడ్, వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్, స్కిల్ క్రాఫ్ట్, కేవీఎం ప్రాజెక్ట్స్ లిమిటెడ్, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. సేఫ్టీ ఆఫీసర్స్, ట్రైనీ ఇంజనీర్లు, అసిస్టెంట్ టెక్నీషియన్స్, ఇంగ్లీష్, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్లు, మార్కెటింగ్, రికవరీ ఎగ్జిక్యూటివ్, రికవరీ ఆపరేటర్స్ పోస్టులతో ఆయా కంపెనీలలో భవన నిర్మాణ రంగంలో విరివిగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, ఏదైనా డిగ్రీ, పీజీ చదివిన ఫ్రెషర్స్, అనుభవం ఉన్న అభ్యర్థులు హాజరు కావచ్చన్నారు. వివరాలకు గ్రామాల్లోని సీఆర్డీయే ఫెసిలిటేటర్‌ను లేదా శంకర్ 98484 24207, శ్రీకర్ 99634 25999 నంబర్‌లను సంప్రదించవచ్చన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

తాడేపల్లి రూరల్: 16వ నంబర్ జాతీయ రహదారిపై ప్రాతూరు అండర్‌పాస్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. సేకరించిన వివరాల ప్రకారం.. నులకపేటకు చెందిన ఎస్‌కే హుస్సేన్ విజయవాడలో ఒక కంపెనీలో మెడికల్ రిప్రజెంటేటివ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఉదయం విజయవాడ నుంచి గుంటూరు ద్విచక్రవాహనంపై వెళుతున్నాడు. ఆయన కుంచనపల్లి ప్రాతూరు అండర్‌పాస్ వద్దకు రాగానే ఎదురుగా వెళుతున్న టాటా ఏసీలో నుంచి ఓ పట్టా ఎగిరి వచ్చి హుస్సేన్ ముఖంపై పడింది. దీంతో హుస్సేన్ బండి అదుపు తప్పి పక్కనే ఉన్న ఫుట్ రెస్ట్‌ను గుద్దుకుంది. దీంతో ఆయన విజయవాడ నుంచి గుంటూరు వెళ్లే సర్వీస్ రోడ్‌లోకి ఎగిరి పడ్డాడు. ఈ ప్రమాదంలో హుస్సేన్‌కు ఎడమకాలు విరిగి ఎముకలు బయటకు వచ్చాయి. గాయపడిన హుస్సేన్‌ను స్థానికులు 108లో కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు.

# దేవదాయశాఖ ఈవో బాధ్యతల స్వీకరణ



ఈవోలు శ్రీనివాసరావు, సురేష్‌లను సన్మానిస్తున్న అర్చకులు

ఫిరంగిపురం: మండల దేవదాయ ధర్మాదాయ శాఖ ఈవోగా బత్తుల సురేష్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన జె.శ్రీనివాసరావు బదిలీపై కాకుమాను మండలం కొండపాటూరుకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా 113.తాళ్లూరు గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయాన్ని సురేష్ పరిశీలించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సురేష్‌ను, బదిలీపై వెళ్లిన శ్రీనివాసరావులను అర్చకులు ప్రసన్నమూర్తి, కృష్ణమూర్తి, ధర్మకర్త లక్ష్మారెడ్డిలు సన్మానించి అభినందనలు తెలిపారు.

# నేటి నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

తాడేపల్లి రూరల్: దేశ వ్యాప్తంగా వామపక్ష పార్టీల పిలుపు మేరకు మంగళవారం నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు బి.వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అండ చూసుకుని ఇజ్రాయెల్ దేశం, పాలస్తీనాపై దాడులు చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రధానంగా హాస్పటల్స్, నివాసాలపై దాడులు చేస్తున్నారని.. ఈ దాడులను ఖండిస్తూ సాయంత్రం 5 గంటలకు తాడేపల్లి బోసుబొమ్మ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నామని అన్నారు. వామపక్ష పార్టీలు, ప్రజాతంత్ర వాదులు, ప్రజా సంఘాలు, లౌకిక వాదులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు, సీపీఐ తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, నాయకులు డీవీ భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రుణాల పేరుతో మోసంపై ఫిర్యాదు

**బాధితులకు రూ.2.10 లక్షల టోకరా**

కృష్ణలంక(విజయవాడ తూర్పు): బీసీ రుణాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసిన ఘటనపై బాధితులు సోమవారం రాత్రి కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాణిగారితోట 17వ డివిజన్‌కు చెందిన కొందరు మహిళలకు ఫిబ్రవరి నెలలో ఒక చర్చిలో గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన అజయ్ అనే దివ్యాంగుడు పరిచయమయ్యాడు. తర్వాత అతను తాడేపల్లి క్రిస్టియన్‌పేటకు చెందిన మరో దివ్యాంగురాలు అమ్ములును వారికి పరిచయం చేశాడు. ఈ క్రమంలో వారిద్దరూ కలసి తాము బీసీ రుణాలు ఇప్పిస్తామని.. దరఖాస్తు చేసుకుంటే రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు ఇస్తారని చెప్పారు. ముందుగా ప్రాసెసింగ్ ఫీజుగా రూ.5 వేలు ఇవ్వాలని చెప్పడంతో మహిళలు వారి మాటలు నమ్మి ఇచ్చేందుకు ఒప్పుకొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఈ నెల 6వ తేదీ వరకు మొత్తం 42 మంది వారి ఆధార్ కార్డు, ఇతర ఐడీ కార్డు జిరాక్సులు ఇవ్వడంతో పాటు విడతల వారీగా ఒక్కొక్కరు రూ.5 వేలు చొప్పున రూ.2.10 లక్షలు వారికి చెల్లించారు. ఈ నెల 10వ తేదీన బాధితులు రుణాలు ఎప్పుడు వస్తాయని వారిని ప్రశ్నించగా మాట దాటవేశారు. అనుమానం వచ్చిన బాధితులు తమ డబ్బులు తమకు తిరిగి ఇవ్వాలని కోరారు. రూ.40 వేలు మాత్రమే ఇస్తాం, ఇంకా అడిగితే మీమీద కేసు పెడతాం అంటూ ఎదురు తమను బెదిరించారని బాధితులు వాపోతున్నారు. తమకు డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని బాధితులు కృష్ణలంక పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు అమ్ములును స్టేషన్‌కు పిలిపించి విచారించగా డబ్బులు తీసుకున్న మాట వాస్తవమేనని, మంగళవారం సాయంత్రానికల్లా వారి డబ్బులు వారికి తిరిగి ఇచ్చేస్తానని పోలీసుల వద్ద అంగీకరించినట్లు సమాచారం.

# షాదీఖానాల నిర్మాణాన్ని పూర్తిచేయాలి

**ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ సమావేశం వినతి**



అడ్‌హాక్ కమిటీల జాబితాతో ముఖ్యనేతలు

తెనాలి: నియోజకవర్గంలో 2018లో నిర్మాణం ఆరంభించి వివిధ దశల్లో ఆగిపోయిన షాదీఖానాల పనులను పూర్తిచేసి ముస్లిం సమాజానికి ఉపయోగపడేలా చూడాలని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ (ఎంయూఎఫ్) ముఖ్య కార్యకర్తల సమావేశం కోరింది. ఇందుకు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తిచేసింది. స్థానిక చినరావూరు తోటలో మైనారిటీ నేత షేక్ ఖలీల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంయూఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండీ కలీమ్ ఆదేశాల ప్రకారం తెనాలి పట్టణ, తెనాలి రూరల్ మండలం, కొల్లిపర మండలాల అడ్‌హాక్ కమిటీలను నియమించారు. రానున్న నాలుగు నెలల్లో అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ఎంయూఎఫ్ బలోపేతానికి విస్తృత స్థాయిలో సభ జరపాలని తీర్మానించారు. పట్టణ అడహాక్ కమిటీలో షేక్ దావూద్, షేక్ నఫీజ్, షేక్ మగ్బూల్, షేక్ మస్తాన్ షరీఫ్, షేక్ రహ్మతుల్లా, షేక్ షంషుద్దీన్, షేక్ పయాజ్, షేక్ జాలు, షేక్ అబ్బాస్ ఉండగా, రూరల్ మండల కమిటీలో పఠాన్ కరిముల్లాఖాన్, షేక్ సలామ్, షేక్ అజ్మతుల్లా, షేక్ జాకీర్, షేక్ అజీజ్, కొల్లిపర మండల కమిటీలో షేక్ హఫీజుల్లా, పఠాన్ గాలిబ్ షంగీర్, షేక్ కుతుబుద్దీన్, షేక్ మీర్‌ఖాశిం, షేక్ సుభాని ఉన్నారు.

### ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

దుగ్గిరాల: జాతీయ ఎయిడ్స్ కంట్రోలు ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఎయిడ్స్ వాధి నిర్ధారణ, సమీకృత సలహా, పరీక్షలను సోమవాం నిర్వహించారు. దుగ్గిరాల ఆరోగ్య కేంద్రంలో గుంటూరు వారితో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో ఆరోగ్య పరీక్షలు, 54 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. సిఫిలిక్ హెచ్ఐవీ వ్యాధితో బాధపడుతున్న వారిని గుర్తించి రక్త పరీక్షలు నిర్వహించినట్లు డాక్టరు ఇందిర తెలిపారు. వ్యాధి గ్రస్తులను గుర్తించి వారికి త్వరగా చికిత్స అందించడం ద్వారా ఎయిడ్స్‌ని నియంత్రించవచ్చునని ఆమె అన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు బహుమతులు పంపిణీ

దుగ్గిరాల: పదో తరగతిలో 500లకు పైగా మార్కులు సాధించిన ఈమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, సర్టిఫికెట్ ఫైలు బహూకరించారు. చుండూరు భాస్కరరావు గత 20 ఏళ్లుగా ప్రతిభ చూపిన విద్యార్థులకు పుస్తకాలు, విద్యాపరమైన బహుమతులను అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం స్థానిక పాఠశాల విద్యార్థులకు సైతం ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఎస్.ఝాన్సీవాణి భాస్కరరావుని సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### శ్మశాన వాటిక ఆక్రమణలు తొలగించాలని వినతి



దుగ్గిరాల: చిలువూరు మాదిగ పల్లె శ్మశాన వాటిక దురాక్రమణలు తొలగించకుండా బాధ్యతా రహితంగా అధికారులు ప్రవర్తిస్తున్నారని ఏపీ ఎమ్మార్పీఎస్ స్టేట్ లీగల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు మాదిగ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయంలో తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందించారు. సదరు శ్మశాన వాటిక దురాక్రమణలు తొలగించకపోతే సంబంధిత అధికారులపై మరలా హైకోర్టులో ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్.కోటేశ్వరరావు, వి.కమలాకర్, ఎస్ మోహన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేత

దుగ్గిరాల: దుగ్గిరాల బాలికల పాఠశాలలో 8వ తరగతి విద్యార్థుల్లోని ప్రతిభావంతులకు సోమవారం ప్రోత్సాహకం అందించారు. కొలకలూరి మాజీ సర్పంచ్ ప్రసాదం భాస్కర రావు జ్ఞాపకార్థం వారి కుమారుడు ప్రసాదం సురేష్ ఒక్కో విద్యార్థికి రూ.5 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం పాఠశాలలో సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు ఎస్ శోభాదేవి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జగనన్నకు స్వాగతం పలికేందుకు తరలిరావాలి

**తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు**

తాడికొండ: సత్తెనపల్లి నియోజకవర్గం రెంటపాళ్ల గ్రామంలో పర్యటించేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం రానున్నారు. ఈ నేపథ్యంలో జగనన్నకు స్వాగతం పలికేందుకు తాడికొండ నియోజకవర్గ శ్రేణులు భారీగా తరలిరావాలని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు (డైమండ్) ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి నేతల దాడులు, సత్తెనపల్లి రూరల్ పోలీసుల వేదింపులు తాళలేక వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ ఉప సర్పంచ్ కొర్లకుంట నాగ మల్లేశ్వరరావు ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్నారు. తాడేపల్లి నుంచి రోడ్డు మార్గాన విచ్చేస్తున్నారని.. ఉదయం 9 గంటలకు నియోజకవర్గంలోని మండల, గ్రామ పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ, మండల అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు అందరూ హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేసి జగనన్నకు స్వాగతం పలకాలని వనమా ఆ ప్రకటనలో కోరారు.

# ద్విచక్రవాహనాన్ని వదిలి వెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు



గుర్తు తెలియని వ్యక్తులు విడిచి వెళ్లిన వాహనం

దుగ్గిరాల: నెల రోజుల క్రితం వీర్లపాలెంలోని జయలక్ష్మీ రైస్ మిల్లు దగ్గర ఓ ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు విడిచి వెళ్లారు. రైస్ మిల్లు యజమాని ఆళ్ల గోవింద రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు పల్సర్ బైక్ 150సీసీ రిజిష్టర్ నంబరు ఏపీ39బీపీ7482ను నెల రోజుల కిందట రైస్ మిల్లు దగ్గర విడిచి వెళ్లారు. దీనిపై మిల్లు యజమాని పోలీసులకు 10 రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. కాగా స్థానికులు ఆయన వద్దకు వచ్చి ఆ వాహనం తమదేనంటూ ఇవ్వమని మిల్లు యజమానిని అడిగారు. పోలీసులకు ఫిర్యాదు చేశానని.. వారిని అడిగి చట్టప్రకారం తీసుకోమని చెప్పగా స్థానికులు గొడవకు దిగుతున్నారని మిల్లు యజమాని తెలిపారు. అసలు బైక్ హక్కుదారుడు కాకుండా సంబంధం లేని వ్యక్తులు వచ్చి అడగడం గమనార్హం. పోలీసులు త్వరితగతిన ద్విచక్రవాహనాన్ని స్టేషన్‌కు తరలించి ఎవరిదో వారికి అందజేయాలని ఆయన అన్నారు.

# వెన్నుపోటు పుస్తక ఆవిష్కరణ నేడు

దుగ్గిరాల: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తోందని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు తాడిబోయిన శివగోపయ్య అన్నారు. కూటమి మోసాలపై వెన్నుపోటు అనే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్నట్లు సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. దుగ్గిరాల పరిధి రైలుపేటలో మల్లవరపు నాగరాజు ఇంటి వద్ద వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు పుస్తక ఆవిష్కరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల, గ్రామాల పార్టీ నాయకులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచులు, వివిధ విభాగాల కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

మంగళగిరి టౌన్: మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) ఆదేశాలతో మంగళవారం వెన్నుపోటు పుస్తక ఆవిష్కరణ నిర్వహిస్తున్నట్లు మంగళగిరి వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు ఆకురాతి రాజేష్, నాలి వెంకట కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరు బైపాస్ రోడ్‌లోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు పుస్తక ఆవిష్కరణ జరుగుతుందని.. పట్టణ, మండలంలోని వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

# ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీవితాలతో ఆటలొద్దు

మంగళగిరి టౌన్: ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీవితాలతో ఆటలాడడం సరికాదంటూ ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు సోమవారం ఒక ప్రటకలో ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల కోసం ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ ఔట్ సోర్స్‌డ్ సర్వీసెస్ (ఆప్కాస్) పేరిట చిరుద్యోగులకు అవకాశం కల్పించారని అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ముగ్గురు మంత్రుల కమిటీ నియమించి ఉద్యోగ సంఘాలు, పార్టీ నాయకులు రకరకాలుగా వ్యాఖ్యాలు చేస్తూ వారి జీవితాలతో ఆటలాడుతోందన్నారు. రాష్ట్రంలో లక్ష మంది నిరుద్యోగులు వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్నారని.. ఆప్కాస్‌పై మంత్రుల కమిటీ వేయడం అంటే ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పొట్ట కొట్టి ప్రైవేటు ఏజన్సీలకు లబ్ధి చేకూర్చడమే అని అన్నారు. నేటి కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను కొనసాగించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఏసీసీ కార్మికులకు న్యాయం చేయాలి



దీక్షా శిబిరంలో కార్మికులు, నాయకులు

తాడేపల్లి రూరల్: ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్‌తో కలసి సందర్శించి కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా ఈ ప్రాంతంలో పర్యటించిన నారా లోకేష్ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్మికులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇస్మాయిల్, ఆరిఫ్, బాషా, సాంబశివరావు, మాణిక్యరావు, గురవయ్య, షేక్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధులపై దాడులు నియంత్రించాలి

**తెనాలి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వినతి**



సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహాకు వినతిపత్రం ఇస్తున్న సంఘ నేతలు

తెనాలి: వయోవృద్ధులపై దాడులను అన్ని ప్రభుత్వ ఏజెన్సీలు ఖండించాలని, అలాంటి దాడులపై పోలీస్ యంత్రాంగం వెంటనే స్పందించాలని కోరుతూ తెనాలి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహాకు వినతిపత్రం సమర్పించారు. ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవం రోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గృహహింసపై ఏవిధంగా అయితే స్త్రీలకు ప్రభుత్వం రక్షణ కల్పిస్తూ ఉన్నదో.. అలాగే కుటుంబాల్లో వృద్ధుల పట్ల కుటుంబ సభ్యులు ప్రవర్తిస్తున్న తీరును పరిగణన లోకి తీసుకొని వృద్ధులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. వృద్ధుల ఆస్తి, ప్రాణ రక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. అద్దెలపై జీవనం సాగిస్తున్న వృద్ధులపై అద్దెకు ఉంటున్నవారి దాడులపైనా స్పందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 2007లో చేసిన వయో వృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం, అనుబంధంగా 2011లో రాష్ట్ర ప్రభుత్వ చట్టంపై కరపత్రాలు, పోస్టర్లను ముద్రించాలనీ, సచివాలయాలు, నగర పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయం వద్ద ప్రదర్శించాలని సూచించారు. ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం కల్పించాలని కోరారు. సంస్థ అధ్యక్షుడు గుమ్మడి నారాయణ రావు, కార్యదర్శి కావూరి నాగేశ్వర రావు, ఉపాధ్యక్షుడు పీవీ రామబాబు, సంయుక్త కార్యదర్శి ఆర్ భుజంగ రావు, కోశాధికారి పి.మల్లికార్జున రావు, ఎం.అర్జున్, వైఎస్‌సీ బోస్, వై.రాధాకృష్ణ, కె.చంద్రమౌళి, ఎస్.వెంకటేశ్వర రావు, ఎస్.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

# కాలువల్లో వ్యర్థాలను పూర్తిగా తొలగించండి

**మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు**



తెనాలిఅర్బన్: కాలువల్లోని వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు సూచించారు. ఐతానగర్ పాటి కాల్వలో సోమవారం జరుగుతున్న వ్యర్థాల తొలగింపు కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన మురుగు కాలువల పూడికతీత పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. కాల్వల్లో ఉన్న వ్యర్థాలను పూర్తిగా తొలగిస్తే పారుదల ఎక్కువగా జరిగే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.